
జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, జూన్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## నేడు సీఎంగా చంద్రబాబు బాధ్యతలు



- సాయంత్రం 4.41 గంటలకు ముహూర్తం
- అనంతరం ఐదు ఫైళ్లపై సంతకాలు
- తొలి సంతకం మెగా డీఎస్సీ
- రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ రద్దు
- మూడో సంతకం రూ.4 వేలకు పింఛన్ పెంపు
- నాలుగో సంతకం అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ
- ఐదో సంతకం స్కిల్ సెన్సెస్

అమరావతి: ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు గురువారం సాయంత్రం 4:41 నిమిషాలను ఏపీ సచివాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇదే సమయంలో హామీల అమలుకు సంబంధించి ఐదు ఫైళ్లపై సంతకాలు చేయనున్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పింఛన్ రూ.4 వేలకు పెంచుతూ మూడో సంతకం, అన్నక్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగో సంతకం, స్కిల్ సెన్సెస్‌పై ఐదో సంతకం చేయనున్నారు.

## నారా చంద్రబాబు నాయుడు

# అనే నేను..



- అతిరథ మహారథుల మధ్య, అభిమానుల కరతాళ ధ్వనుల మధ్య
- ఘనంగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుతో ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- కొణిదెల పవన్ కళ్యాణ్ సహా 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం
- నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు

(మార్తి సుబ్రహ్మణ్యం)

దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన అతిరథ మహారథులు.. వేలాది మంది అభిమానుల కరతాళ ధ్వనుల మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు.

బుధవారం గన్నవరం మండలం, కేసరపల్లి ఐటీ పార్కు వద్ద ఏర్పాటు చేసిన విశాల ప్రాంగణంలో నారా చంద్రబాబు నాయుడుతో ముఖ్యమంత్రిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు.

సీఎం.. సీఎం.. అంటూ అభిమానుల కేరింతల నడుమ నారా చంద్రబాబు నాయుడు అనే నేను.. అంటూ నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీ, జనసేన అధినేత అయిన కొణిదెల పవన్ కళ్యాణ్‌తో పాటు మొత్తం 24 మంది మంత్రివర్గ సహచరులతో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆహ్వానం మేరకు వరుసగా.. నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్,

మిగతా.. 2లో



## సీనియర్లకు ఇక విశ్రాంతేనా?

- క్యాబినెట్‌పై లోకేష్ ముద్ర
- లోకేష్‌కు లైన్ క్లియర్ చేసిన బాబు
- కొత్త రక్తంతో పాత తరానికి విశ్రాంతి?
- సీనియర్లకు తప్పని నిరాశ
- వైసీపీ నుంచి వచ్చిన వారికి పదవులు
- గతంలో మాదిరిగా నేతలను పిలిపించి మాట్లాడని బాబు
- ఇకపై ఇదే సంప్రదాయం కొనసాగుతుందా?
- టీడీపీ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు

(మార్తి సుబ్రహ్మణ్యం)

టీడీపీలో సీనియర్లకు ఇక విశ్రాంతి ఇచ్చినట్లేనా?.. భవిష్యత్తులో వారు ఇక పదవులపై ఆశ వదులుకోవలసిందేనా?..ఇక కొత్త రక్తంతో పార్టీని కొత్త మార్గం పట్టిస్తారా?..యువనేత లోకేష్ ముద్ర క్యాబినెట్‌పై స్పష్టంగా కనిపిస్తోందా?.. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పార్టీ అధినేత బాబు.. యువనేత లోకేష్‌కు ఇప్పటినుంచే లైన్ క్లియర్ చేస్తున్నారా?.. తాజా క్యాబినెట్ కూర్పు అలాంటి సంకేతాలిస్తోందా?.. ఇదీ ఇప్పుడు టీడీపీ వర్గాల్లో హాట్‌టాపిక్.

కొత్త క్యాబినెట్‌లో సీనియర్లకు మొండిచేయి చూపించిన నేపథ్యంలో.. పార్టీ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షం లేని అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, కొత్త వారితో ప్రయోగం చేశారన్న వ్యాఖ్యలు పార్టీలోని కొన్ని వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఇది కొత్తవారి పనితీరుకు పెట్టిన పరీక్షగా వారు అభివర్ణిస్తున్నారు.

మిగతా.. 2లో



## అదో ఉల్లాసభరితం!


### ◆ ఉరికే ఉత్సాహం..

"ఈయన చాలా నలిగిపోయారు.." అని పవన్ కళ్యాణ్ చేతులు పట్టుకుని అంటుంటే.. చంద్రబాబు కళ్ళు చెమ్మగిల్లడం..

ప్రతి సందర్భంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సొంత తండ్రి కొడుకుల మాదిరిగా ఆప్యాయంగా ఉండటం.. పాదయాత్ర చేసి పార్టీకి ఎంతో సేవ చేసిన లోకేష్ ఎలాంటి అరమరికలు లేకుండా నిన్నటి సమావేశంలో ఎక్కడో వెనక

మిగతా.. 2లో





ఇంతింతై..వటుడింతై.. నాలుగోసారి అంత ఎత్తయి...

3లో



చంద్రబాబు ఈ దేశ సంపద.. బాబు ఒక బ్రాండ్

5లో



ఒడిశా నూతన ముఖ్యమంత్రిగా మోహన్‌చరణ్ మాఝీ

5లో



విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్రంతో మాట్లాడుతా

4లో



## ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్..

- 24 మందితో చంద్రబాబు మంత్రివర్గం
- 17 మంది కొత్త వారికి అవకాశం
- టీడీపీకి 20, జనసేనకు 3, బీజేపీకి 1
- సమతూకం పాటించిన టీడీపీ అధినేత
- మొత్తంగా ముగ్గురు మహిళలకు స్థానం
- వైసీపీ నుంచి వచ్చిన ఇద్దరికి చోటు
- మరోసారి నారా లోకేష్‌కు పదవి

అమరావతి: ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు 24 మందితో మంత్రి వర్గాన్ని ఎంపికచేశారు. వారితో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణస్వీకారం చేయించారు. పవన్‌కళ్యాణ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి కేటాయించే అవకాశం ఉంది. మంత్రుల జాబితాకు సంబంధించి జనసేనకు 3 పదవులు, బీజేపీకి 1 కేటాయించారు. ఒక స్థానాన్ని ఖాళీగా ఉంచారు. మంత్రివర్గంలో సగానికిపైగా కొత్త వారే ఉన్నారు. 17 మందికి అవకాశం కల్పించారు. సామాజికవర్గాల వారీగా చూస్తే మంత్రివర్గంలో నలుగురు కాపులు, నలుగురు కమ్మ, ముగ్గురు రెడ్లకు చోటిచ్చారు. బీసీలు 8 మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ముస్లిం మైనారిటీల నుంచి ఒకరు, ఆర్యవైశ్యుల నుంచి ఒకరికి అవకాశం కల్పించారు. మొత్తంగా వీరిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. సీనియర్లు, యువ నాయకుల మధ్య సమతూకం పాటిస్తూ మంత్రి వర్గాన్ని ఎంచుకున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఆనం రామనారాయ ణరెడ్డి, కొలుసు

మిగతా.. 2లో



## మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు ఘన సన్మానం

విజయవాడ, మహానాడు: బిజెపి రాష్ట్ర పదాధికారుల సమావేశంలో రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బిజెపి జాతీయ కార్యదర్శి,, ధర్మవరం ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి వై సత్య కుమార్‌కు

మిగతా.. 2లో






## నూతన మంత్రివర్గంలో పల్నాడు జిల్లాకు మొండిచెయ్యి!

- ఎన్నికల్లో ప్రాణాలొడ్డి ఎదుర్కొన్న నాయకులు
- ఏడు నియోజకవర్గాల్లోనూ ఘన విజయం
- అయినా సీనియర్లను పరిగణలోకి తీసుకోని అధినేత
- తీవ్ర నైరాశ్యంలో టీడీపీ శ్రేణులు

(వాసిరెడ్డి రవిచంద్ర)

పల్నాడు జిల్లా: ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పడిన ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గంలో పల్నాడు జిల్లాకు మొండి చెయ్యి ఎదురైంది. వెనుకబడిన పల్నాడు జిల్లాకు మంత్రివర్గంలో స్థానం లభించలేదు. నరసరా వుపేట పార్లమెంటుతో సహా ఏడు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థు లు ఘనవిజయం సాధించారు. గెలుపొందిన సీనియర్లు కూడా ఉన్నారు. అయితే వారిని పరిగణలోకి తీసుకోకపోవడంతో పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం

మిగతా.. 2లో

## కొణిదెల పవన్‌కళ్యాణ్ అను నేను..

గన్నవరం: రాష్ట్ర మంత్రిగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ పవన్‌తో ప్రమాణం చేయించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీని సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సత్కరించారు. ఇదే సమయంలో చిరంజీవి, పవన్‌కళ్యాణ్‌ను దగ్గరకు తీసుకుని మోదీ ఆప్యాయంగా పలకరించారు. వేదికపై నుంచి అభివాదం చేశారు.



2

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, జూన్ 2024


## నారా చంద్రబాబు నాయుడు అనే నేను..

(మొదటిపేజీ తరువాయి..)

డా. పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, సత్య కుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, ఎన్ఎండీ ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్ధనరెడ్డి, టీజీ భరత్, ఎస్.సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, ఎం.రాంప్రసాద్‌రెడ్డిలతో రాష్ట్ర మంత్రులుగా గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అందరూ తెలు గులో ప్రమాణం చేయగా.. టీజీ భరత్ ఇంగ్లిష్‌లో ప్రమాణం చేశారు.

### నూతన ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రధాని అభినందనలు:

రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడును భారత ప్రధాని నరేంద్ర మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్ పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. అనంతరం నూతన ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ, ప్రముఖ నటులు రజనీకాంత్ దంపతులు, కొణిదెల చిరంజీవి, రాష్ట్ర భాజపా అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ, పలుపురు పార్లమెంటు సభ్యులు, ఇతర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన భారత ప్రధానమంత్రి

నరేంద్రమోదీని నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్‌లు దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు భారత ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపి.. వారితో గ్రూప్ ఫొటో దిగారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలకు చెందిన కార్యకర్తలు, అభిమానులు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కావడంతో కార్యక్రమ ప్రాంగణం సరికొత్త శోభను సంతరించుకుంది. తొలుత సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రధాన వేదిక సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై నిర్వహించిన వైవిధ్య సాంస్కృతిక కళారూపాలు ఆహూతులను, అభిమానులను, కార్యకర్తలను అలరించాయి.

కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీరుసెల్వం, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీ ఎస్ యడ్యూరప్ప, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పెమ్మసాని చంద్రశేఖర్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, చిరాగ్ పాశ్వాన్, అనుప్రియా పటేల్ తదితరులు హాజరయ్యారు.

## అదో ఉల్లాసభరితం!

(మొదటిపేజీ తరువాయి..)

చిరునవ్వుతో కూర్చోవడం..

బాలకృష్ణ తన సోదరి భువనేశ్వరి తలనిమిరి ముద్దాడడం..


తమ్ముడు ని చూసుకొని చిరంజీవి మురిసిపోవడం.. అన్న పాదాలు తాకి తమ్ముడు పులకించి పోవటం..

చంద్రబాబు, పురందరేశ్వరి ఎంతో ప్రేమగా నమస్కారం పెట్టుకోవడం..

"చంద్రబాబు నాయుడు అనే నేను" అని ప్రస్తావించగానే నందమూరి రామకృష్ణ మొహంలోని భావోద్వేగం..

"పవన్ కళ్యాణ్ అనే నేను" అనగానే అభిమానుల చప్పట్లు..

ఇదంతా చూస్తుంటే ఎంత మనసు సంతృప్తిగా




అనిపిస్తోంది..

నిన్న మొన్నటి వరకు పచ్చి బూతులు, వెకిలి వేషాలు చూసిన కళ్ళతోనే ఇంత ప్రేమను చూడటం.. ప్రజలు ఎందుకు మార్పును కోరుకున్నారో సుస్పష్టం చేస్తోంది.

- ఏ.బాబు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వం కొలువు దీరిన వేళ అమరావతి రాష్ట్ర సచివాలయం విద్యుత్ దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్ముతున్న దృశ్యం









## సీనియర్లకు ఇక విశ్రాంతేనా?

(మొదటిపేజీ తరువాయి..)

ఎలాగూ బలమైన ప్రతిపక్షం లేదు కాబట్టి, సీనియర్లకు అవకాశం ఇవ్వడం కంటే, జూని యర్లకు అవకాశం ఇవ్వడం ద్వారా కొత్త తరాన్ని ప్రోత్సహించినట్లవుతుందని విశ్లేషిస్తున్నారు.

అయితే సీనియర్లను పూర్తిగా పక్కకుబెట్టడం మంచిదికాదని, అనుభవానికి పెద్దపీట వేయకపోతే ఎలా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బలమైన ప్రతిపక్షం లేకపోయినా జిల్లాల్లో రాజకీయాలు చేయడం నిరంతర ప్రక్రియ అని, అందులో కొత్తవారు అప్పుడే పట్టు సాధించలేరని వాదిస్తున్నారు. సీనియర్లను పక్కనపెట్టారన్న భావన కింది స్థాయికి వెళితే, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకూ పనిచేస్తున్న సీనియర్లు కూడా, కాడికిందపడేసే ప్రమాదం లేకపోలేదంటున్నారు. కు రాజకీయాలతో నిండిపోయిన రాష్ట్ర రాజకీయాల్లో సీనియర్లను అంత సులభంగా పక్కనపెట్టడం కూడా మంచిదికాదంటున్నారు.

కాగా ఈ మంత్రివర్గ కూర్పుపై.. అచ్చంగా యువనేత లోకేష్ ముద్ర స్పష్టంగా కనిపిస్తోందన్న వ్యాఖ్యలు, పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. భవిష్యత్తు రాజకీయాలు, పార్టీ పగ్గాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కూడా లోకేష్‌కు బాటలు పరిచారన్న వ్యాఖ్యలు, సీనియర్ల నుంచి వినిపిస్తున్నాయి. సీనియర్లకు క్రమంగా ప్రాధాన్యం తగ్గించి, వారి స్థానంలో యువకులైన కొత్తవారితో.. సొంత టీమ్ ఏర్పాటుకు కలసివచ్చిన వేదికగా సీనియర్లు అభివర్ణిస్తున్నారు.

ఇక అయ్యన్నపాత్రుడు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కళా వెంకట్రావు, ధూళిపాళ్ల నరేంద్ర, యరపతినేని శ్రీనివాసరావు, పరిటాల సునీత, గంటా శ్రీనివాసరావు , కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, జీవీ ఆంజనేయులు,పితాని సత్యనారాయణ, చింతమనేని ప్రభాకర్, గద్దె రామ్మోహన్‌రావు, కాల్వ శ్రీనివాసులు, అమర్ నాథ్‌రెడ్డితోపాటు.. గత ఎన్నికల ముందు జగన్ సర్కారుపై బహిరంగ యుద్ధం చేసిన రఘురామకృష్ణంరాజు వంటి వారికి, మంత్రి పదవులు లభించకపోవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమయింది.

కొత్తవారికి అవకాశం కల్పించిన వారిలో..రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన పల్లా శ్రీనివాసరావు పేరు లేకపోవడం పార్టీ శ్రేణులను నిరాశకు గురిచేసింది. వైసీపీ నుంచి వచ్చిన ఆనం రామనారాయణరెడ్డి, కొలుసు పార్ధసారథికి పదవులివ్వడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అయితే పార్టీకి ప్రతిష్టాత్మకమైన ఎమ్మెల్సీ ఎన్నికలో.. వైసీపీ ఎమ్మెల్యేగా ఉంటూ, టీడీపీ అభ్యర్ధికి ఓటు వేసి గెలిపించిన కృతజ్ఞతతో, నాడు ఆయనకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకే ఆనం రామనారాయణరెడ్డికి మంత్రి పదవి ఇచ్చారంటున్నారు. కానీ ఎన్నికల ముందు చేరిన పార్ధసారథికి, ఏ ప్రాతిపదికన మంత్రి పదవి ఇచ్చారన్న ప్రశ్నలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

ప్రధానంగా.. రాష్ట్రంలో అందరికీ తెలిసిన అయ్యన్న పాత్రుడు, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, బుచ్చయ్యచౌదరి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కళా వెంకట్రావు, రఘురామకృష్ణంరాజు, కన్నా లక్ష్మీనారాయణ, పరిటాల సునీత, చింతమనేని ప్రభాకర్ వంటి ప్రముఖులు క్యాబినెట్‌లో లేకపోవడం పార్టీ శ్రేణులను నిరాశకు గురిచేసింది.

వీరిలో గత జగన్ సర్కారు వేధించిన అయ్యన్నపాత్రుడు, రఘురామకృష్ణంరాజు, చింతమనేని ప్రభాకర్ పేర్లు లేకపోవడం అసంతృప్తికి దారితీసింది. కృష్ణాజిల్లాలో బలమైన కమ్మ వర్గానికి అసలు ప్రాధాన్యం లేకపోవడం, పార్టీలో సీనియర్ అయిన వైశ్య ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు మంత్రి పదవి రాకపోవడం చర్చనీయాంశమయింది. ఆ వర్గం నుంచి కర్నూలు ఎమ్మెల్యే టిజి భరత్‌కు మంత్రి పదవి ఇచ్చినప్పటికీ, కోస్తాలోనే వైశ్యుల సంఖ్య ఎక్కువ ఉంటుందని విశ్లేషిస్తున్నారు.

కేంద్రమంత్రిగా పనిచేసి, బలమైన బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డిని ఓడించిన కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డితోపాటు.. బాబు కుటుంబాన్ని దుర్భాషలాడిన కొడాలి నానిని ఓడించిన వెనిగండ్ల రాముకు, కొత్తవారి కోటాలో మంత్రి పదవులిస్తారని పార్టీ వర్గాలు ఆశించాయి.

### పాత సంప్రదాయానికి భిన్నంగా బాబు..

ఈసారి క్యాబినెట్ కూర్పులో చంద్రబాబునాయుడు తన సహజశైలిని పక్కనబెట్టడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఏ మంత్రివర్గ కూర్పు లేదా విస్తరణ సందర్భంలో ఆశావహులను పిలిపించి, వారితో మాట్లాడే సంప్రదాయం ఉండేది.

"ఫలానా అంశాలు, ఫలానా సమీకరరణల కారణంగా మీకు పదవి ఇవ్వలేకపోతున్నా. అర్ధం చేసుకోండి. నీకు నేనున్నా" అని నచ్చచెప్పేవారు. దానితో వారికి కొంత అసంతృప్తి ఉన్నా, బాబు తమను పిలిచి మాట్లాడారన్న తృప్తితో వెళ్లేవారు. బాబుపై చాలామందికి అసంతృప్తి ఉన్నప్పటికీ, ఇలాంటి ప్రజాస్వామ్యయుత ధోరణి మాత్రం వారిని మెప్పించేది. కానీ ఈసారి ఆ సంప్రదానికి తెరదించటమే పార్టీ వర్గాలను విస్మయపరిచింది.

ఈ విషయంలో ఆయన జగన్ దారిలో పయనించారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీనిని బట్టి భవిష్యత్తులో పార్టీ-ప్రభుత్వానికి సంబంధించి తీసుకునే నిర్ణయాలు కూడా, ఇదే తరహాలో ఉంటాయన్న చర్చ జరుగుతోంది.

## ఉపముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్..

(మొదటిపేజీ తరువాయి..)

పార్ధసారథిలకు ఇచ్చిన మాటను చంద్రబాబు నెలబెట్టుకు న్నారు. మంత్రివర్గ కూర్పుపై చంద్రబాబు తీవ్ర కసరత్తు చేశారని, సామాజిక సమీ కరణాలు, ప్రాంతాలు, వివిధ వర్గాల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని కూటమి వర్గాలు చెబుతున్నాయి.

### కొత్త మంత్రుల జాబితా ఇదే

1. కొణిదెల పవన్‌కల్యాణ్(కాపు)
2. నారా లోకేష్(కమ్మ)
3. కింజరాపు అచ్చెన్నాయుడు(బీసీ, కొప్పుల వెలమ)
4. కొల్లు రవీంద్ర(బీసీ, మత్స్యకార)
5. నాదెండ్ల మనోహర్(కమ్మ)
6. పొంగూరు నారాయణ(కాపు)
7. అనిత వంగలపూడి(ఎస్సీ, మాదిగ)
8. సత్యకుమార్ యాదవ్(బీసీ, యాదవ్)
9. నిమ్మల రామానాయుడు(కాపు)
10. ఎన్ఎండీ ఫరూక్(ముస్లిం మైనారిటీ)
11. ఆనం రామనారాయణరెడ్డి(రెడ్డి)
12. పయ్యావుల కేశవ్(కమ్మ)
13. అనగాని సత్యప్రసాద్(బీసీ, గౌడ)
14. కొలుసు పార్ధసారథి(బీసీ, యాదవ)
15. డోలా బాల వీరాంజనేయస్వామి(ఎస్సీ, మాల)
16. గొట్టిపాటి రవికుమార్(కమ్మ)
17. కందుల దుర్గేష్(కాపు)
18. గుమ్మడి సంధ్యారాణి(ఎస్టీ)
19. బీసీ జనార్ధనరెడ్డి(రెడ్డి)
20. టీజీ భరత్(ఆర్యవైశ్య)
21. ఎస్.సవిత(బీసీ, కురబ)
22. వాసంశెట్టి సుభాష్(బీసీ, శెట్టిబలిజ)
23. కొండపల్లి శ్రీనివాస్(బీసీ తూర్పు కాపు)
24. ముండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి(రెడ్డి)

## నూతన మంత్రివర్గంలో పల్నాడు జిల్లాకు మొండిచెయ్యి!

(మొదటిపేజీ తరువాయి..)

నెలకొంది. గత 2019 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమి పాలు కావడంతో పల్నాడు ప్రాంతంలోని గ్రామాల్లో వైసీపీ నాయకుల దాడులు, వేధింపులతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇళ్లు, పొలాలు బీళ్లు పెట్టి వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఐదేళ్ల పాటు వనవాసం చేసి సార్వత్రిక ఎన్నిక ల సందర్భంగా గ్రామాలకు చేరుకుని ఎన్నికల్లో పాల్గొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పల్నాడు జిల్లాకు చెందిన విడుదల రజిని, అంబటి రాంబాబులకు మంత్రి పదవులు దక్కాయి. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డికి ప్రభుత్వ చీఫ్ విప్ పదవి లభించింది.

దీంతో ఎన్నికల ముందు, ఎన్నికల అనంతరం జిల్లాలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయి దాడులకు తెగబడినా సీనియర్ల అండతో ఎదుర్కొని ఎదురొడ్డి నిలిచారు. ఎన్నికల సంఘం స్పందించి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "సిట్"ను ఏర్పాటు చేసి విచారణ చేపట్టింది. కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ లు, సీఐలపై సస్పెన్షన్ వేటు వేసింది. పల్నాడులో జరిగిన గొడవ లు జాతీయ స్థాయిలో సంచలనం కలిగించాయి. అయితే నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో పల్నాడు జిల్లాకు మంత్రి పదవి లభిస్తుందని టీడీపీ శ్రేణులు ఆశగా ఎదురు చూశారు. జిల్లా నుంచి విజయం సాధించిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారా యణ, ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ అధ్యక్షుడిగా పార్టీ కష్టకాలంలో కార్య కర్తలకు అండగా నిలిచిన జి.వి.ఆంజనే యులు, పల్నాడులో వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట వేసిన జూలకంటి బ్రహ్మారెడ్డిలలో ఒకరికి ఖచ్చితంగా మంత్రివర్గంలో స్థానం లభిస్తుందని ఎదురుచూశారు. సీనియర్ నేతలు యరపతినేని శ్రీనివాస రావు, ప్రత్తిపాటి పుల్లారావు కూడా మంత్రి పదవులు ఆశించి భంగపడ్డారు. దాంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. మంత్రివర్గ విస్తరణలో అయినా పల్నాడుకు స్థానం లభిస్తుందని ఆ పార్టీ శ్రేణులు ఆశిస్తున్నారు.

## మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు ఘన సన్మానం

(మొదటిపేజీ తరువాయి..)

రాష్ట్ర కార్యాలయం లో ఘన స్వాగతం పలికారు. అనంతరం బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఘనం గా సన్మానించారు.
బిజెపి ఎమ్మెల్యే లు సైతం సత్య కుమార్ ను శాలువా లతో సత్కరించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి సత్య కుమార్ పార్టీ కి చేసిన సేవలు ప్రస్తావించారు.

సత్య కుమార్ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్త గా సంఘ పరివార్ క్షేత్రాల ద్వారా, కార్యక్షేత్రం లో ఆయన అనేక కార్యక్రమాలు నిర్వహించారు.

దశాబ్దాల కాలంగా సత్య కాలం పేరుతో అనేక రచనలు సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి ఉపకరించాయని సభలో బిజెపి నేతలు ప్రస్తుతించారు.

## దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు


**విజయవాడ:** ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అమ్మవారిని కేంద్ర సహాయమంత్రి తెలంగాణకు చెందిన బండి సంజయ్ దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఈవో స్వాగతం పలికారు. ఏపీకి చెందిన మంత్రి కందుల దుర్గేష్ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో స్వాగతం పలికారు. వేదపండితులు, అర్చ కులు ఆశీర్వచనం చేశారు. ఈవో అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలు, చిత్రపటం అందజేశారు.



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, జూన్ 2024

## ఇంతింతై..వటుడింతై..
# నాలుగోసారి అంత ఎత్తయి...

- చంద్రబాబు సుదీర్ఘ ప్రస్థానంలో విజయాలు
- 1975 యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రవేశం
- 1978లో తొలిసారి చంద్రగిరి నుంచి గెలుపు
- 1995లో మొదటిసారి ఎన్టీఆర్ నుంచి పగ్గాలు
- జాతీయస్థాయి రాజకీయాల్లోనూ కీలక పాత్ర
- హైటెక్ సిటీ నిర్మాణంతో ప్రపంచస్థాయి గుర్తింపు
- ఉమ్మడి ఏపీ, నవ్యాంధ్రను పాలించిన ఏకైక సీఎం
- నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం



**అమరావతి:** నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు రాజకీయ ప్రస్థానం సుదీర్ఘంగా సాగింది. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబు చిన్నతనం నుంచే గ్రామీణ ప్రాంత పేదల ఇబ్బందులు కళ్లారా చూశారు. చదువుకునే రోజుల్లోనే 1975లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. 1978లో చంద్రగిరి అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం 1980లో సీఎం టంగుటూరి అంజయ్య కేబినెట్‌లో సినిమాటోగ్రఫీ మంత్రిగా పనిచేశారు. 1983లో ఎమ్మెల్యేగా ఓటమి పాలయ్యారు. 1986లో టీడీపీ ప్రధాన కార్యదర్శిగా.. 1989లో కుప్పం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం టీడీపీ సమన్వయకర్తగా నియమితులయ్యారు. ఎన్టీఆర్ నుంచి టీడీపీ పగ్గాలు చేపట్టిన తర్వాత 1995 సెప్టెంబర్ 1న తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 1998లో హైదరాబాద్ లో ఐటీ రంగాన్ని ప్రోత్సహించి హైటెక్ సిటీ ప్రారంభించారు. 1996 యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్నారు. 1999లో జాతీయ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. 1999లోనే రెండోసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఉమ్మడి ఏపీలో ఎక్కువ కాలం సీఎంగా సేవలందించిన నాయకుడి గా చరిత్ర సృష్టించారు. ఉమ్మడి ఏపీలో 2004-2014 వరకూ పదేళ్లు ప్రతిపక్ష నేతగానూ ఉన్నారు. విభజన తర్వాత 2014లో నవ్యాంధ్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సమయంలో అమరావతిని రాజధానిగా చేసి పాలన సాగించారు. రాజధాని అభివృద్ధి కోసం కృషి చేశారు. 2019 నుంచి ఐదేళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నారు. 2024లో నవ్యాంధ్రకు రెండోసారి.. మొత్తంగా నాలుగోసారి సీఎంగా చంద్రబాబు పగ్గాలు చేపట్టి చరిత్ర సృష్టించారు.

# జయశంకర్ బడిబాట పాఠశాలల పునఃప్రారంభం

- పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి జిల్లా:** రాయి కోడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట పాఠశాలల పునఃప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నా రు. ముందుగా చదువుల తల్లి సరస్వతి దేవి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటా లకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జయపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా విద్యాశాఖ అధికా రి వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# చంద్రబాబు డైరెక్షన్‌లోనే రేవంత్‌రెడ్డి కుట్రలు

- ఏడు మండలాల విలీనంపై ఎందుకు మాట్లాడరు
- చిత్తశుద్ధి ఉంటే ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలి
- రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం
- పౌరసరఫరా కుంభకోణంలో సీఎం పాత్ర ఉంది
- బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్:** మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, పెద్ది సుదర్శన్ రెడ్డి బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. బాల్క సుమన్ మాట్లా డుతూ





ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపితేనే ప్రమాణ స్వీకారం చేస్తానని మోదీకి చెప్పానని చంద్రబాబు ఎన్డీఏ ఎమ్మెల్యేల సమావేశంలో చెప్పారు. అప్పట్లో ఏడు మండలాలను ఆంధ్రాలో కలపడంపై తెలంగాణ బంద్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చి పార్లమెంటులో ఎంపీలు కొట్లాడారు. లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టు కూడా ఆంధ్రాకు వెళ్లింది. చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి సీఎంగా ఉండి ఏడు మండలాలపై ఒక్క మాట ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే రేవంత్ నడుస్తున్నారని పేర్కొన్నారు. పది సంవత్సరాల తర్వాత తెలంగాణపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి కలిసి కుట్రలు మొదలుపెట్టారని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా భద్రాచలం రూరల్ మండలంలోని యటపాక, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల, పిచ్చుకలపాడు పంచాయతీలను తెలంగాణలో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

### కమీషన్ల ప్రభుత్వం

రాష్ట్రంలో కరెంటు కోతలు నడుస్తున్నాయి. రైతులకు విత్తనాలు సరిగా అందించడం లేదు. ఏపీలో పనిచేసిన ఆదిత్యానాథ్ నియామకాన్ని వెంటనే రద్దు చేయాలని, తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్ అంటేనే కమీషన్ల ప్రభుత్వమని ధ్వజమెత్తారు. బీఆర్ ఎస్‌పై, కేసీఆర్‌పై కమీషన్లు వేస్తూ కాంగ్రెస్ మంత్రులు కమీషన్లు తీసుకుంటు న్నారు. సింగరేణి బొగ్గు గనులను సింగరేణి సంస్థకు కేటాయించాలని కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజల ప్రయోజ నాల కోసం పనిచేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఐటీఐఆర్‌ను తెలంగాణకు ఇవ్వాలని కోరారు. తెలంగాణ సమస్యల కోసం కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులో మాట్లాడాలని డిమాండ్ చేశారు.

### పౌరసరఫరా కుంభకోణంలో రేవంత్ పాత్ర

పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సివిల్ సప్లయీస్‌లో జరిగిన కుంభకోణంపై ప్రభుత్వం స్పందించడం లేదని, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. రైస్ టెండర్లు, ప్యాడీ టెండర్లు రద్దు అయ్యాయా లేదా? సీఎం రేవంత్ రెడ్డి పౌర సరఫరాల శాఖపై ఎందుకు ఎందుకు సమీక్షించడం లేదు? అని ప్రశ్నించారు. సివిల్ సప్లై కమిష నర్ అందుబాటులో ఉండటం లేదని, మా దగ్గర ఉన్న ప్యాడీని లిఫ్ట్ చేయాలని రైస్ మిల్లర్లు జిల్లా కలెక్టర్లకు లేఖలు ఇచ్చా రన్నారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు రైస్ మిల్లర్ల దగ్గర డబ్బులు మాత్రమే అడుగుతున్నారని తెలిపారు. పౌర సరఫరా కుంభకోణంలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర ఉందని, త్వరలోనే పౌరసరఫరా భవన్‌ను ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

# సామాజిక సమతూకం, యువతరానికి పెద్దపీట

- చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం
- మంత్రివర్గ కూర్పుపై ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు

**వినుకొండ:** అన్నివర్గాలకు న్యాయం చేస్తూ సామాజిక సమతూకం పాటిస్తూ యువతరానికి పెద్దపీట వేసిన మంత్రి వర్గ కూర్పు అద్భుతంగా కుదిరిందని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. కూటమి మంత్రివర్గంలో ఏకంగా 17 మంది కొత్తవారికి అవకాశం కల్పించడాన్ని సాహసోపేతమైన నిర్ణయంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనంగా అభివర్ణిం చా రు. అన్నిప్రాంతాలు, అన్ని జిల్లాలు, అన్ని వర్గాలకు ప్రాధాన్యం లభించేలా మంత్రుల ఎంపికలో చంద్రబాబు జాగ్రత్తలు తీసుకున్నారని కితాబిచ్చారు. ముగ్గురు మహిళలకు కూడా చోటు కల్పిస్తూ, సీనియర్లు, యువత, విద్యావంతులు, అనుభవజ్ఞుల మధ్య సమతూకం పాటిస్తూ మంత్రివర్గాన్ని రూపొందించారని ప్రశంసించారు. తొలిసారి గెలిచిన వాళ్లలో 10 మందిని మంత్రులుగా ఎంచు కోవడం ద్వారా కూడా కొత్త తరానికి ప్రాతినిధ్యం కల్పించినట్లయిందన్నారు.



# చింతలపల్లిలో 107 ఎర్రచందనం దుంగల పట్టివేత

- లగేజ్ ఆటో, మోటారుసైకిల్ స్వాధీనం
- ఇద్దరిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

**ప్రకాశం జిల్లా:** కొమరోలు మండలం చింతలపల్లి అటవీ పరిధిలో 107 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు అధ్వ ర్యంలో కడప సబ్ డివిజన్ ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ టీమ్ కడప నుంచి కూంబింగ్ చేపట్టింది. సమీపంలోని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేశారు. తర్వాత కడప నుంచి కొమరోలు చేరుకుని చింతలపల్లి అటవీ ప్రాంతంలో తనిఖీ చేస్తుండగా సోమవారం రాత్రి భైరవస్వామితిప్ప వద్ద ఒక ఆటో, ఒక మోటారుసైకిల్ అనుమానాస్పదంగా కనిపించాయి. వాటిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా కొంతమంది అక్కడ నుంచి పారిపోయేందుకు ప్రయ త్నించారు. అయితే వారిలో ఇద్దరిని టాస్క్ ఫోర్స్ సిబ్బంది పట్టుకోగలిగారు. వారిని తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన రాజేంద్రన్ కుమార్ (41), ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం గడికోటకు చెందిన వాసం వెంకటసుబ్బయ్య(43)లుగా గుర్తించారు. వారి నుంచి ఆటోలో లోడ్ చేస్తున్న 107 ఎర్రచందనం దుంగలు, ఒక లగేజి



ఆటో, మోటారుసైకిల్, మూడు సెల్‌ఫోన్లు, రూ.30,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించి బుధవారం కేసు నమోదు చేశారు. ఈ కేసును ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు. అడవుల్లోకి పారిపోయిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కేసుకు సంబం ధించి లోతైన విచారణ చేపడుతున్నామని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి రివార్డులకు సిఫారసు చేస్తున్నట్లు చెప్పారు.

## సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి
# క్యాలెండర్ రూపొందించండి

- ఆగిన చిన్నతరహా ప్రాజెక్టుల పనులు ప్రారంభించాలి
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు భూములు గుర్తించండి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశం
- ఖమ్మంలో విద్య, సాగునీటి రంగాలపై సమీక్ష
- విదేశీ విద్య స్కాలర్‌షిప్‌లు మరో వంద పెంచనున్నట్లు వెల్లడి

**ఖమ్మం:** కలెక్టర్ కార్యాలయంలో విద్య, సాగునీటి పారుదల శాఖల ప్రగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం సమీక్ష నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రపంచంతో పోటీపడే విధంగా ఖమ్మం జిల్లాను అద్భుతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం పనిచేయాలని సూచించారు. వ్యవసాయాధారిత ఖమ్మం జిల్లాలో వ్యవసాయాన్ని బలోపేతం చేసుకోవడం వల్ల ఆర్థిక వనరులు పెరుగుతాయన్నారు. సాగు నీరు అందించే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసుకుందామని తెలిపారు. జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల ప్రగతి, వాటికి కావాల్సిన నిధులు, పూర్తయ్యే గడువు తది తర అంశాలపై లోతుగా సమీక్ష చేసుకుందమని, జిల్లాలో ఉన్న మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఎన్ఎస్పీ కెనాల్స్, సీతారామ ప్రాజెక్ట్, మధ్యతరహా, చిన్న తరహా పెండిరగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి క్యాలెండరు తయారు చేసుకుని ఆ ప్రణాళిక ప్రకారంగా ముందుకు వెళదామని పేర్కొన్నారు. మొదటగా ఆరు నెలలో పూర్తయ్య ప్రాజెక్టులు, ఏడాది లోపు పూర్తయ్యే ప్రాజెక్టు లు, రెండేళ్లలో పూర్తి చేసుకునే ప్రాజెక్టులకు సంబంధించి క్యాలెండర్ తయారు చేసుకుని నిర్ణిత గడువులోగా పూర్తయ్యేలా టార్గెట్ పెట్టుకుని పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో కొన్నిచోట్ల చిన్నతరహా సాగునీటి ప్రాజెక్టులకు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ఇప్పటికీ పనులు మొదలు కాని (ఉదాహరణకు పంద్రేగుపల్లి) ప్రాజెక్టుల పనులను సత్వరం ప్రారంభించేందుకు చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. జిల్లా నుంచి వృధాగా సముద్రంలోకి నీరు వెళ్లకుండా ప్రతినీటి బొట్టును ఒడిసి పట్టుకుని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



### విద్యపై ప్రత్యేక ఫోకస్..ఏడాదిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్

ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజాపాలన ప్రభుత్వం విద్య పైన ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. రాష్ట్ర బడ్జెట్లో ఎంత అవసరమైతే అంత నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్ర చరిత్రలోనే ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారం భమైన మొదటి రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ ఇచ్చాం. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మాణం చేయడానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో నిధులు కేటాయించాం. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ దేశానికి ఒక మోడల్‌గా అద్భుతంగా నిర్మాణం చేయనున్నాం. ఖమ్మం జిల్లాలో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు వెంటనే భూముల ను గుర్తించి మ్యాపులను సంబంధిత అధికారులకు అందజేయాలి. ఏడాదిలోగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం గా పెట్టుకుంది. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ద్వారా అందిస్తున్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల సంఖ్యను మరో వందకు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

## ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని...
# బైక్‌పై ప్రత్తిపాటి

- కార్యకర్త వాహనంపై వేదిక దగ్గరకు...
- చంద్రబాబు ప్రమాణస్వీకారానికి హాజరు

**గన్నవరం:** కేసరపల్లి ఐటీ పార్కు సమీపంలో చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి మూడు పార్టీల శ్రేణులు లక్షలాదిగా పోటెత్తారు. భారీ సంఖ్యలో వాహనాల్లో తరలివచ్చారు. దీంతో జాతీయ రహదారిపై విపరీతమైన రద్దీ ఏర్ప డిరది. భారీ వాహనాలు ముందుకు కదిల్లేని పరిస్థితి నెలకొంది. గన్నవరం హైవే పరిసరాలు స్తంభించడంతో మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వేదిక వద్దకు సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ఎటూ కదల్లేని ఆ పరిస్థితుల్లో కారులో నుంచి దిగి వేదిక దగ్గరకు చేరుకోవడానికి సాహసయాత్రనే చేశారు. కార్యకర్తకు చెందిన ద్విచక్ర వాహనంపై సభా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. అప్పటికే ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకార ఘట్టం ముగియడంతో అందరికీ శుభాకాంక్షలు తెలి పి వెనుదిరిగారు. అయితే ఇదే సమయంలో ఆయన బైక్ ప్రయాణం దృశ్యాలు వైరల్‌గా మారాయి.



జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, జూన్ 2024

# పదేళ్ల నిరీక్షణ ఫలించిన వేళ..

- అసెంబ్లీ గేటు తాకనీయమన్న వారికి అదిరిపోయే రిప్లై
- డిప్యూటీ సీఎం హెూదాలో అడుగుపెట్టబోతున్న పవన్

**అమరావతి:** కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలంటారు.. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అదే చేశారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా విజయం సాధించిన పవన్.. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనకు డిప్యూటీ సీఎం ఫిక్స్ అయినట్టు



తెలుస్తోంది. ఎమ్మెల్యేగా అసెంబ్లీ గేటు తాకనీయబోమన్న వారికి ఓ రేంజ్ సమాధానమిది. ఏకంగా డిప్యూటీ సీఎంగానే అసెంబ్లీలో పవన్ అడుగు పెట్టబోతున్నారు. వాస్తవానికి ఆయన విజయం కూడా ఓ అద్భుతమే. 70 వేల కు పైగా మెజారిటీతో పిఠాపురం నుంచి విజయం సాధించారు. ఇంత మెజారిటీ అంటే మాటలు కాదు. పిఠాపురంలో పవన్ గెలవరంటూ వైసీపీ నేతలు నానా రచ్చ చేశారు. తను మాత్రమే కాదు.. తన పార్టీ తరపున బరిలో నిలిచిన వారం దరినీ గెలిపించుకున్నారు. పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న పవన్‌ను ఏపీ ప్రజలు పూర్తిగా నమ్మారు. సినిమాల ద్వారా వచ్చిన డబ్బును రైతులకు సాయంగా ఇచ్చారు. 2019లో రెండు చోట్ల పోటీ చేసి ఓడినా కూడా పవన్ ఏపీని వీడలేదు. ప్రజలకు ఎప్పటికప్పుడు అండగా నిలిచారు. టీడీపీ అధినేత చంద్రబాబు జైలు పాల్కెనప్పుడు ఆ పార్టీకి అండగా నిలిచారు.

### ప్రమాణస్వీకారం వేళ మోదీకి పవన్ రిక్వెస్ట్

చంద్రబాబు ప్రమాణస్వీకారం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రిగా పవన్‌కళ్యాణ్ ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం తర్వాత వెళ్లిపోతున్న ప్రధా ని మోదీకి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఓ రిక్వెస్ట్ చేశారు. అన్నయ్య కలుస్తా రని పవన్ కోరగా..మోదీ స్వయంగా చిరు దగ్గరకు వెళ్లారు. మెగా బ్రదర్స్‌ను దగ్గరకు తీసుకుని హత్తుకున్నారు. వారితో ప్రజలకు అభివాదం చేయించి ఇద్దరి నీ అభినందించారు. చిరంజీవి..పవన్ గడ్డాన్ని పట్టుకుని మోదీ ముందు తన తమ్ముడిని అభినందిస్తుండగా రామ్‌చరణ్ ఎమోషనల్ అయ్యారు.

## చంద్రబాబు చిత్రపటానికి
# పాలాభిషేకం

**అమరావతి:** ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాలుగోసారి ప్రమాణస్వీకారం చరిత్ర లో చిరస్థాయిలో నిలిచిపోతుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి కొనియాడారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాల యంలో చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన



చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.



## పాఠశాలల తొలిరోజే
# దుస్తులు, పుస్తకాలు

- తెలంగాణ చరిత్రలో మొదటిసారి కార్యక్రమం
- ఖమ్మంలో పంపిణీని ప్రారంభించిన భట్టివిక్రమార్క

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా ప్రభుత్వ పాఠశా లలు ప్రారంభమైన మొదటిరోజే పిల్లలకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేసింది. ఖమ్మం పట్టణంలోని ఎన్ఎస్‌టీ రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిల్లలకు బుధవారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క దుస్తులు, పుస్తకాల పంపిణీని ప్రారం భించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు విద్యకు మా ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# విజయం ఎవరిది?

కలిసి వచ్చిన కాపులది
భుజం తట్టిన బీసీలది
కలుపుకు పోయిన కమ్మలది
ధర్మం కోసం నిలబడిన క్షత్రియులది
ఆశీర్వదించిన బ్రాహ్మలది
విజయోస్తు అన్న వైశ్యులది
మంచికి నిలబడ్డ రెడ్లది
ముందుకొచ్చిన ముస్లింలది.

ఎవడ్రా మమ్మల్ని విడదీసేది?
మీరు చిమ్మిన విషానికే కూలిపోయే మూలాలు కావు మావి.

కళ్లాపి చల్లి
ముగ్గుకర్ర గీసుకుని
తులసమ్మకి దండం పెట్టుకుని కానీ బయటికి అడుగుపెట్టని
మంగళకరమైన బ్రతుకులు మావి.

మా మూలాలు ఒకటే.
మా ధర్మం ఒకటే.
మా పద్ధతులు ఒకటే.

మాలో మాకు గొడవలు పెట్టి
నీపబ్బం గడుపు కుందాం అనుకున్నావేమో.
ఏకమై నిలిచిన మా వెంట్రుక కూడా నువ్వు పీకలేవు.

కష్టపడి పనులు చేసుకొని ఉద్యోగాలు, వ్యాపారాలు,
కులవృత్తులు చేసుకొని పైసా పైసా కూడబెట్టుకొని
సంపాదించిన మా రూపాయిలో నుంచి బాధ్యతగా మేము
కట్టిన పన్నులని పప్పు బెల్లాలుగా మార్చి తాయిలాలిచ్చి
ఓటుబ్యాంకులుగా, నీకు బానిసలుగా
మార్చుకుందామనుకున్న నీ పుండాకోరు తెలివితేటలు
అర్థం కానివాళ్ళు ఎవరూ లేరు.

కమ్మలూ, కాపులు వేరు కాదు.
మేము అన్నదమ్ములం.
మా ఇద్దరి మూలం ఒకటే.

బెజవాడలో ఎవరో ఇద్దరు రౌడీ ఎదవల ఫ్యామిలీల మధ్య జరిగిన పంచాయితీని రెండు కులాల మధ్య చిచ్చుగా, రావణ కాష్టంగా మార్చి చలికాసుకున్నది నీ బాబు. వాడి పాపం పండబట్టే దిక్కులేని చావు చచ్చాడు.

ఇకపై కమ్మలు, కాపులు వేరు వేరు కాదు.
మా యాదవులు.
మా గవళ్లు.
మా పద్మశాలీలు.
మా చాకలి.
మా మంగలి.
మా రెల్లి.
అందరూ మావాళ్లే.

మా మా గ్రామాల పుట్ట మన్నుతో పునాది పడ్డ మా అమరావతినే కాల తంతావురా?

నీకు తగిలినది మామూలు శాపం కాదురోరేయ్.
మా ఆడపడుచులు అమ్మవారి స్వరూపాలు. వారి శాపనార్థాలు చాలు. నువ్వు తుడిచిపెత్తుకు పోవటానికి.

నీ చివరి రాత రాయబోయేది మా గ్రామ దేవతలే.

ఇకపై మా నినాదం ఇదే

కాలరాద్దాం – కులాల భేదం.
కలిసివుంటేనే – కలదు సుఖం.

**- బాలరాజ్ సజ్జా**

# బాబు ప్రమాణ స్వీకారం వేళ... ఏపీకి గుడ్‌న్యూస్

- రూ.50 వేల కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టు
- మూడు రాష్ట్రాలను పరిశీలిస్తున్న కేంద్ర సంస్థ
- ఆంధ్రప్రదేశ్‌లో సానుకూల అంశాలపై పరిశీలన
- ప్రముఖ పత్రికలో కథనంపై నిరుద్యోగుల్లో ఆశలు

**అమరావతి:** టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వేళ రాష్ట్రానికి శుభవార్త అందుతోంది. రాష్ట్రంలో భారీ రిఫైనరీ ప్రాజెక్టు ప్రారంభానికి బీపీసీఎల్ పరిశీలి స్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఏడాదికి 12 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న రిఫైనరీ నెలకొల్పాలని బీపీసీఎల్ భావిస్తోందని, ఈ ప్రాజెక్టు కోసం 50 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. అయి తే ఈ రిఫైనరీ నెలకొల్పేందుకు మూడు రాష్ట్రాలను బీపీసీఎల్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో ఒకచోట ప్రారం భించాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. పెరుగుతున్న ఇంధన డిమాండ్‌ను తీర్చడా నికి భారతదేశానికి మరిన్ని రిఫైనరీలు అవసరం ఉంది. అందులో భాగంగా బీపీసీఎల్ తూర్పు తీరంలో లేదా పశ్చిమ తీరంలో మరొక రిఫైనరీని ప్లాన్ చేస్తోంది. చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయి అని ఒక అధికారి చెప్పినట్లు ఎకనమిక్స్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. మరోవైపు బీపీసీఎల్ చైర్మన్ కృష్ణ కుమార్ సైతం ఇటీవల ఇదే విషయంపై మాట్లాడారు. 2029 నాటికి బీపీసీఎల్ తన సామర్థ్యాన్ని 45 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచుకునేం దుకు ప్లాన్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం బీపీసీఎల్‌కు




ముంబై, కోచి, మధ్యప్రదేశ్‌లోని బినాలో రిఫైనరీలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు కోసం తూర్పు తీర ప్రాంతం, పశ్చిమ తీరప్రాంతాలను బీపీసీఎల్ పరిశీలిస్తోంది. ఇందులో భాగంగానే ఆంధ్ర ప్రదేశ్‌లో ఏర్పాటు చేసే ఆలోచనలు సైతం చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఎకనమిక్స్ టైమ్స్ ప్రచురించిన ఈ కథనం సోషల్ మీడియాలో చక్కర్లు కొడు తోంది. ఆ భారీ ప్రాజెక్టు ఏపీకి రావాలని వార్త తెలిసిన వెంటనే నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. ఈ వార్తను షేర్ చేస్తున్న టీడీపీ కూటమి శ్రేణులు.. ఏపీకి స్వర్ణయుగం మొదలుకాబోతోందంటూ పోస్టులు పెడుతున్నారు. 50 వేల కోట్ల పెట్టుబడి ఒకేసారి వస్తే స్థానికులకు భారీగా ఉద్యోగాలు లభిస్తాయని, వేల మందికి పరోక్షంగా లబ్ధి కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ భారీ ప్రాజెక్టును ఏ మేరకు ఏపీకి తీసుకువస్తారనేదీ చూడాలి మరి.

# వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేయాలి

- బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి
- ప్రజల్లోకి వెళ్లి కేంద్ర పథకాలు వివరించాలి
- పదాధికారుల సమావేశంలో మంత్రి సత్యకుమార్

**విజయవాడ:** బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. మంత్రి సత్యకుమార్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. సంస్థా గతంగా పార్టీని



బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం చేసే మేళ్లు ప్రజలకు వివరించి చెప్పాలని సూచించారు. గెలిచిన శాసనసభ్యులు కూడా జిల్లాల్లోకి వెళ్లి పర్యటనలు చేయాలని, కార్యకర్తల కష్టాలు పట్టించుకోవాలని పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, విశ్వ కర్మ లాంటి పథకాలను వివరించి వికసిత ఆంధ్రప్రదేశ్ కోసం సమిష్టిగా పనిచేయాల ని కోరారు. మోదీ ఆదర్శంగా అంత్యోదయ లక్ష్యంగా పనిచేయాలని, సాధారణ కార్యకర్తగా ఎదిగాను. .ఇదే స్ఫూర్తితో పనిచేస్తే కార్యకర్తలకు భవిష్యత్తు ఉంటుం దని తెలిపారు.

ఈ సమావేశంలో బీజేపీ అధికార ప్రతినిధి ఆర్.డి. విల్సన్, నాయకులు, పదాధికారులు పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్రంతో మాట్లాడుతా

- ప్రత్యేక హెూదా ముగిసిపోయిన అంశం
- కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ వ్యాఖ్యలు

**అమరావతి:** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయమంత్రి శ్రీనివాసవర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. స్టీల్ ప్లాంట్ ఏపీ ప్రజలకు సెంటిమెంట్‌తో కూడుకున్నదని, ప్రైవేటీకరణ అంశంపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు.

ప్రజలకు మేలు జరిగేలా అడు గులు వేస్తామని వివరిం చారు. ప్రత్యేక హెూదా ముగిసి పోయిన అంశంగా పేర్కొన్న ఆయన ఏపీకి కేంద్రం స్పెషల్ ప్యాకేజీ ఇచ్చిందని గుర్తు చేశారు. రాబోయే ఐదేళ్లు కూటమితో కలిసి ముందుకెళ తామని ఆయన స్పష్టం చేశారు.







# రేణిగుంట విమానాశ్రయంలో బాబుకి ఘన స్వాగతం

**రేణిగుంట, జూన్12:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం అనంతరం మొట్ట మొదటి సారిగా తిరుపతి జిల్లాలో రెండు రోజుల



పర్యటనలో భాగంగా రేణిగుంట విమానాశ్రయానికి బుధ వారం రాత్రి 7.35 గం.లకు కుటుంబ సమేతంగా చేరుకున్న ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి గారి వెంట మంత్రి నారా లోకేష్ గారు ఉన్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ ఎండోమెంట్స్ కరికాల వలనన్, డిఐజీ షిమోషి, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు ప్రవీణ్ కుమార్, షన్మోహన్, తిరుపతి ఎస్పి హర్ష వర్ధన్ రాజు, ఎమ్మెల్యే లు బొజ్జల సుధీర్ రెడ్డి, పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, జెసి చిత్తూరు శ్రీనివాసులు, టీటీడీ జే ఈ ఓ గౌతమి, తిరుపతి మునిసిపల్ కమిషనర్ అదితి సింగ్ జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ తదితరులు గౌ. ముఖ్య మంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

అనంతరం ముఖ్యమంత్రి గారు రాత్రి 07.55 గం.లకు రేణిగుంట విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన తిరుమలకు శ్రీవారి దర్శనార్థం బయల్దేరి వెళ్లారు. రేపు ఉదయం 7.30 గం.లకు తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకోనున్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, జూన్ 2024

## ఒడిశా నూతన ముఖ్యమంత్రిగా మోహన్‌చరణ్ మాఝీ

- హాజరైన ప్రధాని మోదీ, బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు
- ఆహ్వానాన్ని మన్నించి పాల్గొన్న ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్



భువనేశ్వర్: ఒడిశా నూతన ముఖ్యమంత్రిగా బీజేపీ గిరిజన నేత మోహన్ చరణ్ మాఝీ బుధవారం సాయంత్రం 5 గంటలకు ప్రమాణ స్వీకారం చేశారు. భువనేశ్వర్‌లోని జనతా మైదాన్లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ ఇతర ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. తన ప్రమాణ స్వీకారానికి హాజరవ్వాల్సిందిగా మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌ను బుధవారం ఉదయం స్వయంగా నవీన్ ఇంటికి వెళ్లి మరీ మోహన్‌చరణ్‌మాఝీ ఆహ్వానిం చారు. ఆహ్వానాన్ని మన్నించి నవీన్ పట్నాయక్ ఈ కార్యక్రమానికి హాజరయ్యా రు. ఇటీవల లోక్‌సభ ఎన్నికలతో పాటు జరిగిన ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 78 సీట్లు సాధించి అధికారాన్ని చేజిక్కించుకుంది. బిజుజనతాదల్ 51 సీట్లతో సరిపెట్టుకుని అధికారాన్ని కోల్పోయింది.

# చంద్రబాబు ఈ దేశ సంపద.. బాబు ఒక బ్రాండ్

మూడోసారి కూడా మేమే అధికారంలోకి వస్తాం, 407 స్థానాలు సాధిస్తాం అని బీరాలు పలికిన బి.జె.పి ఎన్నికల ఫలితాలు రోజు చతికిల పడింది. దానితో షేర్ మార్కెట్ కుప్పకూలి మదుపర్ల ఆస్తి 31 లక్షల కోట్లు ఆవిరయ్యింది. మరుసటి రోజు బాబు అభయ హస్తం అందించడంతో ఒక్క సారిగా సూచీ పెరిగి, అది 51 లక్షల కోట్ల మేర లాభపడింది. అదే బాబు గారి సత్తా.

బాబు ఎక్కడుంటే అభివృద్ధి చెంతనే వుంటుంది. బాబంటే ఒక బ్రాండ్. బాబు ఈ దేశపు ఆస్తి , సంపద. తెలంగాణా దేదీప్యమానంగా వెలుగొంటున్నది అంటే దానికి కారణభూతుడు చంద్రబాబు. ఆయన వేసిన అభివృద్ధి అనే విత్తు నేడు మహావృక్షమై శాఖోపశాఖలుగా విస్తరించింది. తెలంగాణాను ఆర్థికంగా నిలబెడుతున్నది హైద్రాబాద్. అదే హైద్రాబాద్ అభివృద్ధికి బాబు కల్పించిన మౌలిక సదుపాయాలు కారణం.

తల్లి పిల్లల ఆకలి కడుపును ఎలా చూస్తుందో , నాయకుడు రాష్ట్ర, దేశ భవిష్యత్తును గమనిస్తూ ముందుచూపుతో వ్యవహరించాలి. రాబోయే కాలానికి 5,10,20,30 సం.లకు తగిన ప్రణాళిక వేసుకుని ఒక విజన్ తోటి ముందుకు సాగాలి. అలా ముందుకు సాగే నాయకుల్లో భారత్ లో ఒకే ఒక్కడు ఉన్నాడు , వారే చంద్రబాబు. హైద్రాబాద్ లో హైటెక్ సిటీ నిర్మాణం కోసం కొండలు , గుట్టలు చదును చేసి నిర్మాణాలు కడుతుంటే అంతా ఎగతాళి చేశారు. ఐ.టి రాబోయే కాలాన్ని ఎలా శాసిస్తుందో ముందే ఊహించ గలిగాడు చంద్రబాబు. అలా రేపు కొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్ ప్రపంచాన్ని శాసించ బోతోందని కూడా తరచూ చెబుతున్నాడు.

ఒక దార్శనికుడి ఆలోచన భవిష్య తరాల గురించి ఆలోచిస్తుంది. ఎందుకు పనికిరాని నాయకుడే కులం , మతం , వర్గం అంటూ చీలికలు తెచ్చి పబ్బం గడుపుతూ వుంటాడు. తెలుగు రాష్ట్రాల నుండి ప్రపంచదేశాలకు ఐ.టి నిపుణులు వెళ్లి సేవలందిస్తున్నారు. అనేక ప్రసిద్ధ కంపెనీలకు సి.ఇ.ఓ లు అవుతున్నారు. వారు ఆర్థికంగా బలపడుతూ , ఆయా దేశాల అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నారు. రాజకీయాల్లో కూడా ప్రవేశిస్తున్నారు. ఇదంతా ఒక దార్శనికుడి స్వప్నం. మానవాళిపై ఆయనకున్న నమ్మకం. అదే నేడు నిజమవుతున్నది.

మారుతున్న కాలాన్ని బట్టి ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవ్వడం ఆయనకొక వ్యసనం. టెక్నాలజీని అన్ని రంగాల్లో ప్రవేశ పెట్టడం, సేవలను చౌకగా అందుబాటులోకి తీసుకు రావడం ఆయన వృత్తి. రాజకీయ రంగమే తీసుకుంటే ఏ శాఖమీదయినా ఆయనకు పట్టు ఉంటుంది. దేనికెంత ఎంత బడ్జెట్ ఇచ్చామో , భవిష్యత్తులో ఎంత అవసరమో అన్నీ నోటి లెక్కలుగా చెప్పగలడు. ఇక పార్టీ పరంగా కొన్ని వేల మందిని పేర్లు పెట్టి పిలవగలడు.

ఏ నాయకుడూ నూటికి నూరు మందిని సంతృప్తి పరచలేడు. కులాల , ప్రాంతాల లెక్కల్లో కొందరిని పక్కన పెట్టక తప్పదు. దానితో కొందరు శత్రువులుగా మారతారు. టి.డి.పి అంటేనే ఒక రాజకీయ శిక్షణాలయం. రాజకీయ వేత్తలను తయారుచేసే ఒక పాఠశాల. దానికి ప్రిన్సిపాల్ చంద్రబాబు. కేంద్రంలో ఎన్నో కూటములు కట్టాడు. అనేక ప్రభుత్వాలను ఏర్పరచి, ప్రధానులుగా అందలం ఎక్కించాడు. తన శిష్యులు మంత్రులు, ముఖ్య మంత్రులయ్యారు. ఎంత చేసినా తన పరిధిలోనే తానుంటాడు.

ఇప్పటి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 50 వేల నుండి 1 లక్ష లోపు మెజారిటీ వచ్చిన వారు 30 మంది , 20 – 50 వేల వరకు మెజారిటీ వచ్చిన వారు 94 మంది ఉన్నారంటే ఇది ఎలాంటి విజయమో అర్థం చేసుకోవచ్చు. అలాగే 10 - 20 వేల వరకూ మెజారిటీ వచ్చిన వారు 23 మంది ఉన్నారు. 5 – 10 వేల లోపు మెజారిటీ వచ్చిన వారు 12 మంది వున్నారు. వెయ్యి నుండి 5 వేల లోపు మెజారిటీ వచ్చిన వారు ముగ్గురు మాత్రమే వున్నారు. వెయ్యి లోపు వారు ఇద్దరంతే ఇద్దరు మాత్రమే ఉన్నారు. తక్కువ మెజారిటీ మడకశిర (sc) నుండి టి.డి.పి అభ్యర్థి ఎం.ఎస్. రాజు 351 ఓట్లతో గెలవగా , అత్యధిక ఓట్ల మెజారిటీ గాజువాక నుండి టి.డి.పి అభ్యర్థి పల్లా శ్రీనివాస రావు 95, 235 ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు. ఇదంతా బాబును చూసే ఓట్ల వర్షం కురిపించారు. ఒక కసితో ఓట్ల సునామీ వెల్లువెత్తింది. బాబయితేనే రాష్ట్ర పాలనను గాడిలో పెట్టగలడు , ఇక ఎవరు వచ్చినా ఈ రాష్ట్రాన్ని రక్షించలేరు అనే ఒక భావన అందరిలో వచ్చింది. పైగా బి.జె.పి , జనసేన పొత్తు కూడా లాభించింది. కేంద్రంలో ఈసారి కూడా బి.జె.పి వస్తుంది అనే ప్రచారం చేసుకున్నా ఆంధ్రా ప్రజలు విశ్వసించలేదు.



6,7 % జనసేన ఓటర్లు మాత్రం అగ్నికి ఆజ్యం పోసినట్లు తోడయ్యారు. జనసేన విడిగా పోటీచేస్తే ఓట్లు 2 -3 కు పడిపోయేది. కూటమిగా ఎన్నికల బరిలో నిలబడడంతో కొత్త శక్తి వచ్చినట్లయ్యింది. అదే జనసేన పోటీ చేసిన 21 + 2 గెలవడానికి కారణం. విడిగా పోటీచేస్తే మరలా పాత ఫలితాలే వచ్చేవి. గత 2019 ఎన్నికల్లో ఒకే ఒక్కసారి అంటున్నాడని , వై.ఎస్.ఆర్ పాలను గుర్తుచేసు కుని ఓట్లు కుమ్మరించారు. తరువాత గానీ వారికి పూర్తి సినిమా కనిపించింది.

బటన్లు నొక్కి డబ్బు పంపుతున్నా ఆ డబ్బు కనబడడం లేదు. డబ్బంతా ఎక్కడికి పోతున్నదో కూడా తెలియకుండా మాయం అవుతోంది అని మదనపడ సాగారు. అదే జగన్మాయ అంటే. పది రూపాయలు ఇచ్చి వంద లాక్కోవడం. తాకట్టు పెట్టు కోవడానికి ప్రభుత్వ ఆస్తులన్నీ అయిపోతున్నాయి.

ఇక ప్రైవేటు ఆస్తులపై కన్ను పడిందని ప్రజలు భావించారు. ప్రతి వ్యక్తికీ సొంత భూమి మీద మమకారం ఉంటుంది. దాన్ని తన్నుకు పోవాలని చూసే ప్రయత్నాలు జరుగుతుంటే ఆవేశం కట్టలు తెచ్చుకుంది. ల్యాండ్ టైటిల్ యాక్ట్ చట్టంతో ప్రజల్లో ఒక అభద్రతా భావం ఏర్పడింది. రేపు నివాస స్థలాలు , ఇళ్లను కూడా తాకట్టు పెట్టుకుంటారేమో అనే భయం సామాన్య ప్రజల్లో కలిగింది. అదే ఓట్ల రూపంలో ప్రజ్వరిల్లింది.

ప్రతి రోజూ పని పని అని చంద్రబాబు చావ గొడతాడు , హాయిగా ఉమ్మడి రాజధానిగా 10 సం.లు హైద్రాబాద్ వుంటే ఇక్కడకు తీసుకువచ్చి కూలిపని చేయిస్తున్నాడని 2014 నాటి ఉద్యోగులు భావించారు. ఎంత అడిగితే అంత ఫిట్ మెంట్ , ఇతర ప్రోత్సాహకాలు ఇచ్చినా వారికి అవేమీ కనిపించ లేదు. తమ ఓట్లు కాక ఇతరుల ఓట్లుకూడా వై.సి.పి కి వేయించారు. కట్ చేస్తే , నేడు జీతం కూడా అడుక్కోవాల్సిన స్థితికి దిగజారిన పరిస్థితి. మింగలేక , కక్కలేక , ఎవరికీ చెప్పుకోలేక నరక యాతన అనుభవించారు.

మేమే ఎంతో మేధావులము , రాష్ట్రాన్ని ఒంటిచేత్తో నడుపుతున్నాం అనుకునే ఉద్యోగులు , అసలు తాము ఎలా మోసపోయాం , దేనికోసం మోసపోయాం అనేది వారికే అర్థం కాలేదు. వారిలో ఆవేశం , ఆక్రోశం కట్టలు తెంచుకుంది. ఈ ఎన్నికల్లో ఉద్యోగులు పోలింగ్ సజావుగా నడిపించారు. ఒక్క ఓటు కూడా దొంగ ఓటు పోలవ్వకుండా చూశారు. బాలెట్ ఓట్లలో వారి ఓటింగ్ ప్రస్ఫుటంగా తెలిసింది.

ఇక పొత్తున్న బి.జె.పి చూస్తే అది రాజకీయాన్ని రాజకీయంగానే చూస్తుంది. ఎత్తులు, జిత్తులు వేస్తుంది. ఆ విషయాన్ని బి.జె.పి పరివారం దాచుకోదు , బహిరంగంగానే చెబుతుంది. వాజ్ పాయ్ నాటి బి.జె.పి కాదిది. మోదీ బి.జె.పి ఇది. పక్కా రాజకీయ పార్టీ అని చెబుతారు. ఆవేశపరులు ఇంకొక అడుగు ముందుకు వేసి మోదీ ఉండగా పొత్తులే ఉండవు. సంకీర్ణ ప్రభుత్వాలు వుండవు. ఆ అవసరం , ఆ ఖర్మ మాకు లేదు అని ప్రకటిస్తారు. ఇక సోము వీర్రాజు లాంటి వారయితే చంద్రబాబును బి.జె.పి గడప తొక్కనివ్వం అని శపథం చేస్తారు.

ఇక ఇప్పటి కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ లాంటి వారయితే 2019 లో మా ఓట్లన్నీ వై.సి.పి కి వేసాం అని ప్రకటిస్తారు. సిగ్గుండాలి ఇల్లాంటి మాటలు అనే చిత్తకార్తె నాయకులకు. ఒక్క శాతం ఓట్లు లేని బి.జె.పి , టి.డి.పి తో పొత్తు పెట్టుకుని టి.డి.పి ఓట్లతో ఎం.పి అయ్యి ఇప్పుడు కేంద్ర మంత్రి అయ్యాడు. మంత్రి అయ్యాక సోము వీర్రాజును వాటేసుకుని ఏడవడం కాదు , చంద్రబాబు కాళ్ళు కడిగి నీళ్ళు తలమీద జల్లుకోవాలి.

చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ కే కాదు భారతదేశానికి ఒక ఆస్తి. భారతదేశం ఆయన్ను సరిగ్గా ఉపయోగించుకోలేదు. ఎ.పి ప్రజలు కూడా ఆయన దార్శనికతను గుర్తించలేదు. ఎంతసేపూ ఎన్.టి.ఆర్ కు వెన్నుపోటు పొడిచాడు అంటూ ఆయన కారెక్టర్ ని డామేజ్ చేయడానికే చూశారు గానీ ఆయన ముందు చూపును , దేశం పట్ల ఆయనకు గల ప్రేమ , నిబద్ధత ను గుర్తించలేక పోయారు. ముఖ్యంగా 2019 లో ఎ.పి ప్రజలు ఆయన్ను ఓటమికి గురిచేయడం ఎ.పి ప్రజల దౌర్భాగ్యం.

ఒక ఉత్తరాది అహంకారి సాయంతో ఒక ఆర్థిక నేరస్తుడి చేతిలో రాష్ట్రాన్ని పెట్టారు. అసలు ఏ ఏ రంగాల్లో ఎంతెంత అవినీతి జరిగిందో తెల్సుకోవడానికే చాలా సమయం పడుతుంది. 12 లక్షల కోట్లు అప్పు , ఇవికాక కార్పోరేషన్ల తాకట్టు పెట్టి తెచ్చిన అప్పులు తెలుసుకోవడం పెద్ద పని. ఎంత ఘోరంగా అప్పులు తెచ్చారంటే రాబోయే మద్యం అమ్మకాలను షూరిటీగా పెట్టి వేలకోట్లు అప్పులు తెచ్చారు. అలా ఇవ్వడానికి బ్యాంకులకు అధికారం ఎక్కడ వుంది ?

తక్షణం బాబు వాటిని కాన్సిల్ చేసి ఉద్యోగుల, రాజకీయ నాయకుల నుండీ వసూలు చేసుకోమని చెప్పాలి. అప్పుల చిట్టా అంతా బాబు ప్రజల ముందు ఉంచాలి. అప్పులు ఇప్పించడంలో బి.జె.పి కు భాగం ఉంది కాబట్టి అడ్డుకట్ట వెయ్యడానికి బి.జె.పి ప్రయత్నిస్తుంది. వై.సి.పి వారికి పైన మనవాడే ఉన్నాడులే , ఏమీ అవ్వదులే అనే ధైర్యంలో ఉన్నారు. వీటిపై బాబు రాజీపడితే 2029 కి మరలా బంగారు పళ్ళెంలో వై.సి.పి కి అప్పగించవల్సి వస్తుంది.

-వల్లూరి పల్లి ఎల్. ప్రసాద్

## కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం

- 41 మందికి పైగా మృతి

కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ ఎత్తైన భవనంలో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో ఐదుగురు భారతీయులతో సహా 41 మంది సజీవదహనమయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.
కువైట్‌లోని దక్షిణ మంగాఫ్ జిల్లాలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. 41 మంది ప్రాణాలు కోల్పోయి నట్లు ప్రభుత్వ ఆధ్వర్యంలోని కువైట్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. బుధవారం తెల్లవారుజామున మంటలు చెలరేగడంతో భవనంలో మంటలు వ్యాపించాయి.

మంటలు అంటుకుని భవనం అంతా వేగంగా వ్యాపించాయి. దీంతో చాలా మంది లోపలే చిక్కుకున్నారు. ఈ భవనంలో ఎక్కువగా కార్మికులు నివాసం ఉంటున్నట్లు తెలుస్తోంది. ప్రమాదంలో 41 మంది మృతి చెందారని.. మరో 43 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కువైట్ డిప్యూటీ ప్రధాని వెల్లడించారు. మృతుల్లో ఐదుగురు కేరళకు చెందిన వారు ఉన్నట్లుగా సమాచారం. ఈ ఘటనపై విదేశాంగ మంత్రి జైశంకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇక భారత



రాయబార కార్యాలయం నుంచి కేంద్రమంత్రి సమాచారం సేకరిస్తున్నారు. మృతుల కుటుంబాలకు జై శంకర్ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని.. సహాయ అందిస్తామని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులకు చుక్కెదురు

- భుజంగరావు, తిరుపతన్న బెయిల్ పిటిషన్లు తిరస్కరించిన కోర్టు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులకు నాంపల్లి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను కోర్టు తిరస్కరించింది. ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ ఇంకా విచారించాల్సి ఉన్నందున బెయిల్ మంజూరు చేయవద్దని పోలీసులు కోర్టును కోరారు. దీంతో పిటిషన్లను కొట్టివేస్తూ న్యాయమూర్తి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.



## జగన్ ఐదేళ్లు క్యాడర్‌ను

# కాపాడుకోగలరా?

రాజకీయ పార్టీలకు ఎన్నికలలో గెలుపోటములు సహజమని ఓడిపోయిన పార్టీలు పలుకుతుంటాయి. అది నిజమే కావచ్చు. కానీ ఓడిపోయిన తర్వాత అధికార పార్టీ ఒత్తిళ్ళు తట్టుకుంటూ 5 ఏళ్ళ వరకు పార్టీని కాపాడుకోవడం ఓ ఎత్తు అయితే, 5 ఏళ్ళు ప్రతిపక్షంలో బలహీనపడిన తర్వాత అధికారంలో ఉన్న పార్టీని ఎదుర్కొని ఓడించడం మరో ఎత్తు. రాష్ట్ర విభజన తర్వాత కూడా తెలంగాణలో టిడిపి బలంగానే ఉన్నప్పటికీ కేసీఆర్ దానిని నిర్వీర్యం చేసేశారు. కానీ టిడిపి ఓటు బ్యాంకుని మాత్రం కేసీఆర్ ఏమీ చేయలేకపోయారు.

అందుకే ప్రతీ ఎన్నికలలో ఎన్టీఆర్ని పొగుడుతూ ఓట్లు రాల్చుకునే ప్రయత్నం చేస్తుంటారు. అందుకే 2023 శాసనసభ ఎన్నికలకు ముందు ఖమ్మంలో శ్రీకృష్ణుడు రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం పెట్టించారు కూడా. ఆ ఎన్నికలలో టిడిపి పోటీ చేసి ఉండి ఉంటే గెలిచే అవకాశం లేదనే చెప్పవచ్చు. కానీ ఆ ఎన్నికలలో టిడిపి పోటీ చేయకుండా ఉండిపోయి కాంగ్రెస్ పార్టీకి సాయపడింది. ఓ రాజకీయ పార్టీ ఎన్నికలలో పోటీ చేయకుండా మరో పార్టీని గెలిపించడం, చేతికి మట్టి అంటించుకోకుండా కేసీఆర్కి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం రెండూ విశేషమే కదా? 2014 ఎన్నికలలో ఏపీలో వైసీపి ఓడిపోయినప్పుడు, చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యానికి కట్టుబడి దానిని ఇబ్బంది పెట్టలేదు కనుకనే జగన్ పాదయాత్ర చేసుకోగలిగారు.



2019 నాటికల్లా సర్వశక్తులు కూడగట్టుకొని అధికారంలోకి రాగలిగారు. ఆనాడు చంద్రబాబు నాయుడు వైసీపిని అంతగా ఉపేక్షించడం వలననే అధికారం కోల్పోయారనే వాదనలు నేటికీ వినిపిస్తూనే ఉంటాయి. కానీ 2019లో ఏపీ సిఎంగా బాధ్యతలు చేపట్టిన జగన్మోహన్ రెడ్డి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ప్రతిపక్షాలు అంటూ మొహమాటాలకు పోకుండా టిడిపిని ఉక్కుపాదంతో అణచివేస్తూ నిర్వీర్యం చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. అదే సమయంలో రాష్ట్రంలో వైసీపి ఓటు బ్యాంక్ పెంచుకునేందుకు జగన్ గట్టి ప్రయత్నాలు చేశారు. జగన్ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉండి ఉంటే టిడిపి మనుగడ సాగించడం పెద్ద వింతేమీ కాబోదు.

కానీ 5 ఏళ్ళపాటు ఏకధాటిగా దెబ్బ మీద దెబ్బ తీస్తున్నా పార్టీ చెల్లా చెదురు కాకుండా కాపాడుకోవడం చాలా కష్టం. ఆ సమయంలో చంద్రబాబు నాయుడు కనబరిచిన పోరాటస్ఫూర్తి కారణంగానే టిడిపి బలంగా నిలబడుతూ జగన్ ప్రభుత్వాన్ని గట్టిగా ఎదుర్కోగలిగింది. జగన్ తప్పుడు ఆలోచనలు, తప్పుడు నిర్ణయాలు, తప్పుడు విధానాలు కూడా టిడిపికి బాగా కలిసివచ్చాయని చెప్పవచ్చు. వాటన్నిటినీ చంద్రబాబు నాయుడు తెలివిగా ఉపయోగించుకుంటూ ముందుకు సాగి ఎన్నికలలో వైసీపిని మట్టి కరిపించి మళ్ళీ అధికారంలోకి వచ్చారు.

ఈ 5 ఏళ్ళ చేదు అనుభవాలను చూసిన చంద్రబాబు నాయుడు ఈసారి వైసీపి పట్ల మెతకగా ఉండే అవకాశం లేదు. ఒకవేళ ఉందామనుకున్నా నారా లోకేష్, టిడిపి నేతలు ఉండనీయరు. కనుక ఇప్పుడు వైసీపి చెల్లాచెదురు అయిపోకుండా జగన్ 5 ఏళ్ళు కాపాడుకోగలరా? అసలు తనను తాను కాపాడుకోగలరా? అంటే అనుమానమే. కానీ ప్రజల తరపున పోరాడుతామని, మళ్ళీ అధికారం లోకి వస్తామంటూ అప్పుడే 'కొత్త ప్రగల్భాలు' పలుకుతున్నారు. ఇంతకాలం వైనాట్ 175? అంటూ పార్టీలో అందరినీ మభ్యపెట్టగలిగారు.

కానీ ఇప్పుడు చిలుక పలుకులతో ఎవరినీ మభ్యపెట్టలేరు. అసలు జగన్తో ఉంటే తమకూ ఇబ్బందులు తప్పవనుకునేవారు వైసీపిలో చాలామందే ఉన్నారు. గతంలో పరిస్థితి వేరు కానీ ఈసారి పరిస్థితి వేరేగా ఉండబోతోంది. ఇటువంటి పరిస్థితులను జగన్ స్వయంగా కల్పించుకున్నారు. కనుక పర్యవసనాలకు 'సిద్ధం'గా ఉండాల్సిందే.

- సతీష్ మన్నేపల్లి

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, జూన్ 2024

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడుతో పాటు ఆయన మంత్రి వర్గంలోని 24 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన చారిత్రాత్మక ఘట్టం తాలూకు దృశ్యాలివి**




























Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144